తమలపాకు పండింది

- కాసులు కురిపిస్తున్న తమలపాకుల సాగు
- లాభాలు ఆర్జిస్తున్న రైతులు
- నియోజకవర్గంలో 800 ఎకరాల్లో సాగు
- రూ.18 వేలు పలుకుతున్న పెండీ



అమరాపురం మండలంలో సాగు చేసిన తమలపాకు తోట

అమరాపురం: తమలపాకు తోటలను సాగు చేస్తూ మడకశిర నియోజకవర్గం రైతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ధరలు పెరగడంతో లాభాలు గడిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే తమలపాకు తోటలకు మడకశిర నియోజకవర్గం ప్రసిద్ధి. నియోజకవర్గంలో తమలపాకు తోటలు పెద్ద ఎత్తున విస్తరించి ఉన్నాయి. ముఖ్యంగా అమరాపురం మండలంలో తమలపాకు తోటలు అధిక విస్తీర్ణంలో ఉన్నాయి. మిగిలిన గుడిబండ, రొళ్ల, మడకశిర, అగళి మండలాల్లో కూడా తమలపాకు తోటలు సాగులో ఉన్నాయి. దాదాపు నియోజకవర్గ వ్యాప్తంగా 800 ఎకరాల్లో తమలపాకు తోటలు సాగులో ఉన్నట్లు సమాచారం. జిల్లాలో ఏ నియోజకవర్గంలో కూడా ఇంత పెద్ద ఎత్తున తమలపాకుల తోటలు లేవు. వక్క తోటల్లో తమలపాకులను ఈ ప్రాంతం రైతులు అంతరపంటగా సాగు చేస్తున్నారు.

గతేడాది నష్టాలు..

మడకశిర ప్రాంతంలో వేరుశనగ పంటను సాగు చేసి నష్టపోయిన రైతులకు తమలపాకు తోటలు ఊరటనిస్తున్నాయి. గత ఏడాది తమలపాకు ధరలు (ఒక పెండీ) రూ.6 వేల నుంచి 8 వేల వరకూ పలకడంతో రైతన్నలు నష్టాలపాలయ్యారు. కూలీల ఖర్చులు చెల్లించలేక ఇబ్బందులు పడ్డారు. దీంతో రైతులు నష్టాలను చవిచూశారు. అయితే ప్రస్తుతం తమలపాకు ధరలు పెరగడంతో గత నెల నుంచి రైతులు లాభాల బాట పట్టారు.

ఇలా సాగు చేయాలి..

తమలపాకు తోట సాగు చేసే రైతులు ముందుగా భూమిని బాగా దుక్కి చదును చేసి సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి. అనంతరం తమలపాకు తీగలను జూలై మాసంలో తీసుకొచ్చి అడుగు గుంత తవ్వి అందులో తీగను నాటాలి. తీగకు సూర్యర్శ్మి ఎక్కువగా తగలకుండా ఉండడానికి తీగ పైకప్పును వాడాలి. ఎకరాకు 1,200 తీగలను నాటాలి. రెండు నెలల తరువాత పైకప్పు తీసేయాలి. తీగ అల్లడానికి అగిసే, లేదా బూరుగ విత్తనం వేయాలి. అవి మొలకెత్తి రెండు నెలలకు మూడడుగుల మేర పెరుగుతాయి. అప్పుడు తమలపాకు తీగను అగిసె చెట్టుకు అరటి కందలోని చిప్పతో కట్టాలి. ఇలా ఒకటిన్నర సంవత్సరం వరకూ తీగను కడుతుంటే అది పైకి పోయి బ్రాంచ్‌లుగా ఏర్పడుతుంది. అప్పటి నుంచి ప్రతి నెల కోత కోయవచ్చు. అలాగే వక్క చెట్టుకు కూడ తీగను అల్లుతారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి పశువుల పేడను వేస్తే మంచి దిగుబడి వస్తుంది. ఎకరా తోటలో 8 పెండీల వరకు దిగుబడి సాధించవచ్చు. నెలకు ఒకసారి పెరిగిన తీగను చెట్టుకు కట్టాలి. ఇలా చేస్తే మంచి ఆదాయాన్ని పొందవచ్చు.

చలి కాలంలో తెగుళ్లు

సాధారణంగా తమలపాకు తీగకు తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. చలికాలంలో నల్లజోని, నల్లమచ్చలు తదితర తెగుళ్లు వస్తాయి. ముఖ్యంగా వీటి నివారణకు నీరు తక్కువగా కట్టాలి. నీటి తేమ శాతం ఎక్కువైతే ఇలాంటి తెగుళ్లు సోకుతాయి. దీని నివారణకు మైలుతుత్తం, సున్నం పౌడర్ కలిపి తీగలకు పిచికారీ చేయాలి. ఎక్కువగా ఉంటే సంబంధిత హార్టికల్చర్ అధికారులను సంప్రదించాలి. వారి సూచనలతో తగు మోతాదులో మందును పిచికారీ చేయాలి. అలాగే రసాయనిక ఎరువులను వాడరాదు. కేవలం సహజ సిద్ధమైన పశువుల పేడను మాత్రమే వాడితే పంటకు ఎటువంటి తెగుళ్లు ఆశించవు.



ఆకులను పెండీలుగా పేర్చుతున్న రైతులు

రూ.1.7 లక్షల ఆదాయం



నాకున్న భూమిలో ఒకటిన్నర ఎకరాలో వక్కతోట సాగు చేశా. ఇందులో అంతర పంటగా తమలపాకు తోట సాగు చేశా. గత ఏడాది డిశంబర్, జనవరి నెలలో తమలపాకు కోత చేశా. నెలకు 8 పెండీలు దిగుబడి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్లో మంచి ధర ఉండడంతో కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం మార్కెట్‌కు తరలించా. రూ.17 వేల నుంచి రూ.19 వేల వరకూ (పెండీ అంటే 100 కట్టలు అంటే 10 వేల ఆకులు) అమ్మాను. ఖర్చులన్నీ పోనూ.. నెలకు రూ.1.7 లక్షల ఆదాయం లభించింది. చాలా సంతోషంగా ఉంది.

– మారుతి, రైతు, తమ్మడేపల్లి

ఆదాయం వస్తోంది..



నాకున్న రెండున్నర ఎకరాల పొలంలో రెండు ఎకరాల వక్క తోటలో తమలపాకు తోట సాగు చేశాను. కంటికి రెప్పలా పంటను కాపాడుకుంటూ వచ్చాను. రెండు రోజుల క్రితం కోతలు ప్రారంభించాం. ఒక్కో పెండీ రూ.19 వేలతో తోట వద్ద తమలపాకులను విక్రయించాను. ఖర్చులు రూ.30 వేలు పోనూ.. రూ.1,70,000 ఆదాయం వచ్చింది. ఇది ఒక నెల కోత మాత్రమే. తమలపాకు సాగుతో ఆదాయం బాగుంది.

– హనుమంతరాయప్ప, అమరాపురం మండలం

ఆశాజనకంగా ధరలు



ప్రస్తుతం తమలపాకు ధరలు బాగున్నాయి. ఎప్పుడు లేనంతగా ధరలు మార్కెట్లో పలుకుతున్నాయి. నాకున్న వక్క తోటలో అంతర పంటగా తమలపాకు తోట సాగు చేశా. నాకు 70 సంవత్సరాలు. మా తాతల కాలం నుంచి తోటలు సాగు చేస్తున్నాం. కుటుంబ ఖర్చులకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఈనెల ఖర్చులన్నీ పోనూ.. రూ.50 వేల ఆదాయం వచ్చింది.

– వీరక్యాతరాయప్ప, రైతు, విరుపసముద్రం

ఉపాధి దొరుకుతోంది..



తమలపాకు తోటలు మన ప్రాంతంలో రైతులు సాగు చేయడం వలన మాలాంటి వారికి ప్రతి నిత్యం ఉపాధి దొరుకుతుంది. ప్రస్తుత సీజన్‌లో భోజనం పెట్టుకుని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పని చేస్తా. రూ.650 కూలి చెల్లిస్తారు. తమలపాకుకు ధర తక్కువగా ఉంటే రూ.500 ఇస్తారు. అంతేకాకుండా వంద ఆకులు ఉచితంగా ఇస్తారు. ఇది మన ఖర్చుకు వస్తుంది. మిగతా సొమ్మును ఇంట్లో కుటుంబ పోషణకు వాడుకుంటాను.

– ఈరక్యాతరాయ, కూలీ, గౌదనకుంట,

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న హనుమంతే గౌడు

గుడిబండ: చిగతుర్పి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన హనుమంతే గౌడు రూ.50 వేల నగదును ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. నారాయణప్ప, రంగప్ప, భోజరాజు, తిమ్మన్న, ప్రకాష్, మంజునాథ్, హనుమంతరాయప్ప, లక్ష్మీనరసప్ప తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటకు నిప్పు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని చర్చి వద్ద వడ్డే శ్రీనివాసులుకు చెందిన మామిడి తోటకు ఆకతాయిలు ఆదివారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి దాదాపు 40 చెట్లు కాలిపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. దాదాపు రూ.లక్షదాకా నష్టం జరిగిందని తెలిపాడు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనాలను తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ

గుడిబండ: మండల కేంద్రం నుంచి అమరాపురానికి వెళ్లే రహదారిలో ఆదివారం సాయంత్రం ఎస్‌ఐ రాజకుల్లాయప్ప, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ఆర్సీలు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనాదారులు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపితే జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు.

‘ఆదర్శ’లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పావగడ: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీఈఓ ఇంద్రాణమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తాలూకాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వెల్లడించారు. ఈనెల 14 నుంచి 28వ తేదీలోపు జాతి, ఆదాయ ప్రమాణ పత్రాలు, ఎస్‌ఏటీఎస్ నంబర్, తాజా పాస్‌ఫొటో, ఆధార్ కార్డ్, తల్లిదండ్రుల మొబైల్ నంబర్లు, దివ్యాంగ విద్యార్థులు అంగవైకల్యం ధ్రువీకరణ పత్రం అందించాలన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు తాలూకాలో నివసిస్తూ.. విద్యార్థులను వేరేచోట చదివిస్తూ ఉంటే తహసీల్దార్ నుంచి నివాస స్థల ధ్రువీకరణ పత్రం పొందాలన్నారు. వివరాలకు ఆదర్శ విద్యాలయ హెచ్‌ఎం 9480234789, బీఈఓ 9480695357 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

ఆలయ అభివృద్ధికి విరాళం



ఎమ్మెల్యే సమక్షంలో విరాళం అందిస్తున్న దాత నాని

పావగడ: తాలూకాలోని నాగలమడక హోబళీకి చెందిన క్యాతగానచెర్లు ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి ఎగువపల్లి నాని రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేశ్ సమక్షంలో ఈ మొత్తాన్ని ఆలయ సమితి పదాధికారులకు అందించారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ అధ్యక్షుడు రాజేశ్, మాజీ అధ్యక్షుడు శంకరరెడ్డి, కౌన్సిలర్ టెంకాయల రవి తదితర స్థానిక ప్రముఖులు, దేవాలయ అభివృద్ధి సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

రసాయనాలు కలిసిన నీరు తాగి మేకల మృతి



మృతి చెందిన మేకలు

అగళి: రసాయనాలు కలిసిన నీరు తాగి మేకలు మృతి చెందిన ఘటన కారిదాసన్నపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన చిక్కన్న 40 గొర్రెలు, 4 మేకలను మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. పశుగ్రాసం తినే సమయంలో పంట చేనులో రసాయనాలు కలసిన నీటిని తాగి 3 మేకలు మృతి చెందాయి. రూ.45 వేలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నాడు.

యువతకు పార్టీలో ప్రాధాన్యత కల్పిస్తాం

గోరంట్ల(సోమందేపల్లి) : యువతకు పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు చరణ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతుల రామకృష్ణారెడ్డి ఫాంహౌస్‌లో మండల స్థాయి యువ నాయకుల సమావేశం నిర్వహించారు. చరణ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పడుతున్న ఇబ్బందులు తనకు తెలుసునని అన్నారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలపై స్పందించి వారికి అండగా నిలవాలని తెలిపారు. ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి, రాబోవు ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగనన్నను మళ్లీ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గజమాలతో చరణ్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం శీనప్పల్లిలో కూటమినాయకుల వేధింపులతో బెంగళూరుకు వలస వెళ్లిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రంగప్ప ఇంటికి వెళ్లి అండగా ఉంటామని చరణ్‌రెడ్డి భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు రఘురాంరెడ్డి, పోతుల రామకృష్ణారెడ్డి, మేదర శంకర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చరణ్‌రెడ్డి

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయల జయంతి

హిందూపురం టౌన్: ప్రజా సంక్షేమ పాలన సాగించిన మహాచక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని ఏపీ ఆగ్రోస్ మాజీ చైర్మన్ నవీన్‌నిశ్చల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కృష్ణదేవరాయల విగ్రహం వద్ద జయంతి వేడుకలను బలిజ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల చరిత్ర అమోఘమని, ఆయన ఎంతో మందికి ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, జనసేన ఇన్‌చార్జ్ ఉమేష్, బీజేపీ నాయకుడు పార్థసారథి, బలిజ సంఘం నాయకులు రాయల్ గోపాల్, నంజప్ప, నిమ్మకాయల రాము, బలిజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రొళ్ల: మండల కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయల జయంతిని బలిజ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. తొలుత వివిధ గ్రామాలకు చెందిన బలిజ సంఘం నాయకులు మండల కేంద్రానికి చేరుకుని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి అరటి పిలకలు, మామిడి తోరణాలతో పాటు ప్రత్యేకంగా పూలను కట్టి అలంకరించారు. అనంతరం శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం ముందు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బలిజ సంఘం మండల అధ్యక్షుడు డాక్టర్ వెంకటరమణప్ప, ఉపాధ్యక్షుడు గోవింద రాజు, బలిజ సంఘం నాయకులు పట్టాభి, రంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నవీన్‌నిశ్చల్, బలిజ సంఘాల నాయకులు

నేడు మండలంలో ఉషశ్రీచరణ్ పర్యటన

పరిగి: మండలంలోని హొన్నంపల్లి పంచాయతీ జంగాలపల్లిలో సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో తొలుత ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సగర ఉప్పర కుల బాంధవుడు భగీరథ మహర్షి విగ్రహావిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కాట్టయ్య స్వామి జ్యోతుల ఉత్సవంలో పాల్గొంటారన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

హిందూపురం టౌన్: పట్టణంలోని జామియా ఈద్గా మైదానం అల్‌హిలాల్ పాఠశాలలో జామియా మసీదు కమిటీ ముతవల్లీ నూరుల్లాఖాన్ ఆధ్వర్యంలో కిమ్స్ సవీరా ఆస్పత్రి సహకారంతో ముబారక్ హెల్త్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సామాజిక సేవా సంస్థ అధ్యక్షతన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ సవేరా వైద్యశాల వైద్యులు రోగులకు హృద్రోగ, కంటి పరీక్షలు నిర్వహించారు. 87మందికి హార్ట్, 50 మంది కంటికి, 66 మంది జనరల్ పేషెంట్లను డాక్టర్లు పరీక్షలు చేసి తగు సూచనలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ పాల్గొని, డాక్టర్లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ సవేరా వైద్యులతో పాటు డాక్టర్ రామ్ కుమార్, డాక్టర్ ఇమ్రాన్ ఖాన్, డాక్టర్ షాహిద్, చంద్రశేఖర్, ఆబిద్, షమీమ్, ఉమర్, ఆప్టికల్ సభ్యులు, జామియా సభ్యులు ముక్తియార్, దార్ఫిన్, ముస్తఫా, ఇషాక్, ఫైరోజ్ అలీ, ఉబెదుల్లా హుసేన్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం డాక్టర్ దినకర్, శాంతిరాం కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. చిన్న, పురిటి పిల్లల వైద్యుడు దినకర్ సుమారు 100 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. శాంతిరాం కంటి ఆసుపత్రి వైద్యులు దాదాపు 80 మందికి కంటి పరీక్షలు చేశారు. అలాగే 50 మందికి ఈసీజీ, 2డీఎకో పరీక్షలు చేశారు. డాక్టర్ దినకర్ మాట్లాడుతూ.. 20 మందికి నంద్యాలలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. మండలంలో ఇప్పటికే 20 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వహకులు సవిత, పార్వతమ్మ, విద్యాసాగర్, వినిత్‌కుమార్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కొటిపిలో నాగలక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వేణురెడ్డి



వరుణ్‌రెడ్డిని పరామర్శిస్తున్న మధుమతిరెడ్డి

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలంలోని కొటిపి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి నాయనమ్మ నాగలక్ష్మమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ ఆది, బసిరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. అలాగే పట్టణంలోని ఒకటవ వార్డు కొల్లకుంటకు చెందిన పార్టీ నాయకుడు వరుణ్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బాధితుడిని వేణురెడ్డి పరామర్శించారు కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లకుంట శివశంకర్‌రెడ్డి, జిల్లా బూత్ కమిటీ ఇన్‌చార్జి లోకేష్, వెంకటేష్, రాజు, వెంకటరెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకుడు వరుణ్‌రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స తర్వాత ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న చౌళూరు మధుమతిరెడ్డి ఆదివారం వరుణ్‌రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. సర్పంచ్ నంజప్ప, లోకేష్ రెడ్డి, తిమ్మారెడ్డి, ప్రకాష్, సూరి పాల్గొన్నారు.


పురాతన ప్రతిమలకు గోల్డ్ పాలిష్



పాపనాశేశ్వరుడు



ప్రభావళికి బంగారు పూత



ధ్వజ స్తంభానికి బంగారు పూత

లేపాక్షి: మహాశివరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయంలో ఉన్న పురాతన ప్రతిమలకు ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ మరమ్మతులు చేయించి గోల్డ్ పాలిష్ చేయించారు. కలశాలు, గంటలు, ప్రభావళితో పాటు వీరభద్రస్వామి, పాపనాశేశ్వర, ధ్వజ స్తంభం, దుర్గాదేవి, పార్వతీదేవి విగ్రహాలకు గోల్డ్ పాలిష్ వేసి మెరుగులు దిద్దారు. ఆలయ గోపురాల్లో కలశాలు ఏర్పాటు చేయడంతో దేవాలయం ఆకర్షణీయంగా కనబడుతోందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

● అ‘పూర్వ’ సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

పరిగి: మండలంలోని మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2014–15 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువులను పూజించి, ఆశీస్సులు తీసుకున్నారు. అదేవిదంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో కలియ తిరిగి నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈసందర్భంగా ఒకరికొకరు సెల్ఫీలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వపు గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ ప్రభుత్వం దివాళా తీసింది’



ఎంపీ కారజోళను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: ‘ఖజానాలో చిల్లి గవ్వ లేక కాంగ్రెస్ ప్రభుత్వం దివాళా తీసింది. చేసిన అప్పులు తీర్చేందుకు మళ్లీ అప్పు చేస్తోంది. సుమారు రూ.40 లక్షల కోట్లు కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సి ఉండగా.. నయాపైసా ఇవ్వలేదు’ అని చిత్రదుర్గం ఎంపీ గోవింద కారజోళ మండిపడ్డారు. ఆదివారం తాలూకాలోని చిక్కహళ్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన వినాయకుడి దేవాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ.. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్లు ఆందోళన చేపడుతారన్నారు. వచ్చిన ఆదాయంలో సగం అభివృద్ధి పనులు.. సగం అప్పులు తీర్చడానికి వినియోగించు కోవాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటి దగా కోరు ప్రభుత్వాన్ని చూడలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, జేడీఎస్ నాయకులు ఎస్‌ఏ ఈరణ్ణ, సొగడు వెంకటేష్, అక్కులప్ప నాయుడు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదినారాయణస్వామి రథోత్సవం



రథోత్సవ దృశ్యం

చిలమత్తూరు: మండల సరిహద్దు వీరాపురం సమీపంలో ఆదినారాయణ కొండ వద్ద స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. కర్ణాటక, మండలం నుంచి పెద్ద ఎత్తున భక్తులు రథోత్సవాన్ని వీక్షించడానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, మొక్కులను చెల్లించారు.

క్రీడా దుస్తుల పంపిణీ

పరిగి: మండలంలోని మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆదివారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. పీడీ పీటీ వెంకటేష్ ఆర్థిక సౌజన్యంతో క్రీడల్లో ప్రతిభ చూపుతున్న 12 మంది విద్యార్థులకు దుస్తులు అందించారు.

భక్తిశ్రద్ధలతో దొనె సేవ



దొనె సేవలో పాల్గొన్న గొరవయ్యలు

అమరాపురం: తమ్మడేపల్లి గ్రామంలో ఆదివారం మైలారలింగేశ్వర స్వామికి కురుబ కులస్తులు దొనె సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి ఉదయం వివిధ రకాల అభిషేకాలు చేపట్టారు. భక్తులు తెచ్చిన వివిధ రకాల పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. మధ్యాహ్నం స్వామి వారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఆవరణలో కొలువుదీర్చారు. అనంతరం దొనెలో పాలు, పండ్లు, చక్కెర, నెయ్యి, పెరుగు అందులో పోసి, బొరుగులు, బెల్లం తదితర వాటిని నల్ల కంబడి పోసి భూతప్ప సేవ నిర్వహించారు. గొరవయ్యలు తమ ఢమరుకంతో ఏళుకోటి ఏళుకోటి అంటూ చుట్టు ప్రదక్షిణలు చేసి, పాలు తాగారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

శ్రీశైలానికి పాదయాత్ర

సోమందేపల్లి: శివమాలధారులు శ్రీశైలానికి ఆదివారం పాదయాత్రగా తరలివెళ్లారు. సోమందేపల్లికి చెందిన కానిస్టేబుల్ వెంకటేష్, బాలు, అంజినప్ప, మారుతి, రాము పాదయాత్రగా వెళ్లారు. వారిని బంధుమిత్రులు ఘనంగా సాగనంపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9912220726